


ముకరంపురలో ఇళ్లలోకి చేరిన వరద నీరు

పొంచి ఉన్న ముప్పు

- మొదటి వర్షానికే నగరంలో ఉప్పొంగిన డ్రైనేజీలు
- పలుచోట్ల ఇళ్లలోకి చేరిన నీరు
- వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన అదనపు కలెక్టర్

కరీంనగర్ టౌన్, జూన్ 27: మండే ఎండలు.. ఉక్కపోతతో నగర ప్రజలు సతమతం అయ్యారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా చినుకుజాడ లేక జనం ఇబ్బందులు పడ్డాడు. అయితే బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నగరంలో పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి నీరు వచ్చింది. వర్షాకాలం ఆరంభమైన తర్వాత కురిసిన మొదటి వర్షానికే నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా జలమలమయ్యాయి. ముకరంపురతో పాటు పలు కాలనీల్లో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాత్రంతా జాగారం చేశారు. ఇళ్లలోకి వరద నీరు రావడంతో ఇంట్లోని వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి. మొదటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే వర్షా కాలంలో ముగిసే వరకు భారీ వర్షాలు కురిస్తే ఎలా అనే ప్రశ్న నగరవాసులను వేధిస్తోంది.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీలు నిర్మించినప్పటికీ అధికారుల మధ్య సమన్వయ లోపం, ఇంజనీర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయని ప్రజలు ఆవదేన వ్యక్తం చేస్తున్నారు. ముకరం పుర ప్రాంతంలో కొత్తగా 19 ఫీట్ల వెడల్పు, 8 ఫీట్ల లోతుగా గతంలో ఉన్న వరద మురుగునీటి కాలు వను విస్తరిస్తూ నిర్మాణ పనులు చేపట్టారు.

అయితే వాటికి కనెక్టిం గ్ ఉన్న పాత మురుగు నీటి కాలువ (నాలా) నాలుగు ఫీట్ల లోతు ఎని మిది ఫీట్ల వెడల్పుతో ఉండగా దానిని విస్తరించక పోవడంతో ఆయా ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరాయని వాపోతున్నారు. ఈ డ్రైనేజీ స్థానంలో 19 ఫీట్ల వెడల్పు, 8 ఫీట్లలోతుగా కొత్తగా నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్‌తోపాటు స్థానికులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పలు మార్లు నగరపాలక సంస్థ ఎస్‌ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ స్థాయి అధికారులు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి పట్టించుకోలేదని ఆరో పిస్తున్నారు. రానున్న కాలంలో భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ముంపు ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు. పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం లేకపోలేదని అంటున్నారు. ఇప్పటికైనా తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ముకరంపుర ముంపు ప్రాంతాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

నగరంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు వచ్చిన ముకరంపుర ముంపు ప్రాంతాన్ని గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్, స్మార్ట్‌సిటీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రిలో భారీ వర్షానికి జలమయమైన కాలనీలు అంటూ ఫొటో ఫీచర్ ప్రచురితంకావడంతో స్పందించిన అధికారులు కాలనీలను సందర్శించి, పరిస్థితిని తెలుసుకున్నారు. ఇటీవల కొత్తగా నిర్మించిన స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీ, పాత నాలా కలిసిన చోట వెడల్పు, లోతు తక్కువగా ఉండడంతో ఈ సమస్య తలెత్తినట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొత్త డ్రైనేజీ నిర్మాణంతో తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశపడ్డామని, అయితే కొద్ది చోట్ల పాత వాటిని అలాగే ఉంచారని, దీనితో మొదటి వర్షానికే మాకు కంటి మీద కునుకులేకుండా ఇళ్లలోకి నీరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై స్మార్ట్‌సిటీ, ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించిన అదనపు కలెక్టర్ దీనికి కారణాలేమిటని అడిగి తెలుసుకున్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించినట్లు స్థానికులకు తెలిపారు.


ముకరంపురలో వరద మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులు

వనమహోత్సవానికి సిద్ధంగా ఉండాలి

- మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలి
- లక్ష్యాన్ని అధిగమించాలి : డీఆర్డీవో శ్రీధర్


నర్సరీలను పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీధర్

కరీంనగర్ రూరల్, జూన్ 27: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉండాలని ఉపాధి హామీ సిబ్బందిని డీఆర్డీవో శ్రీధర్ సూచించారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్, బొమ్మకల్ గ్రామాల్లో ఉపాధి హామీ సైట్‌లను ఆయన సందర్శించారు. అలాగే నర్సరీల్లో చెట్ల పెంప కంను ఆయన సందర్శించి రికార్డులను, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 53,990 గుంటలు తవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రోడ్లకిరువైపులా, చెరువు గట్లు, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, కార్యలయాల వద్ద గుంటలు తీసే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అన్నారు. అలాగే నర్సరీల్లో మొక్కలు తొందరగా పెరిగేందుకు వ్యవసాయశాఖ అధికారుల సాయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఏపీఓ శోభారాణి, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నీట్, ఎన్‌టీఏను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నిరసన


అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతి పత్రం అందచేస్తున్న కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్, జూన్ 27: నీట్ పరీక్ష, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు వైద్యుల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ కావాలనే కలతో ఏన్నో ఏళ్లుగా శ్రమిస్తూ 24లక్షల మంది నీట్ పరీక్ష రాశారని అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగుతున్నా, సుప్రీంకోర్టు తప్పుపట్టినా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నీట్, యూజీ పరీక్షలు రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలన్నారు. ఎన్‌టీఏ చైర్మెన్‌ను తొలగించడమే కాదు మొత్తం ఏన్‌టీఏను రద్దు చేయాలన్నారు. బలహీన వర్గాలను విద్యకు దూరం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయవద్దని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు మాడుగుల రాములు, పి ఈశ్వర్‌రెడ్డి, ఎం రఘుశంకర్‌రెడ్డి, కె నారాయణరెడ్డి, ఆవాల నరహరి, ఆర్ చంద్రశేఖర్, తూముల తిరుపతి, కె రాజమౌళి, వేల్పుల రత్నం, టి తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాల అమలుపై సిద్ధంగా ఉండాలి

పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి


మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, జూన్ 27: దేశ వ్యాప్తంగా జూలై 1వ తేదీ నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై పోలీసు అధికారులు సంసిద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా డీజీపీ రవి గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన చట్టాల అమలు కోసం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ అభిషేక్ మొహంతితో సహా జిల్లాలోని అన్ని పోలీసు ఠాణాల అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నూతన చట్టాల అమలుపై పలు కీలక అంశాలను చర్చించారు. ఐపీసీ 1860కి బదులుగా భారతీయ న్యాయ సంహిత 2023. సీఆర్ పీసీ 1973కు బదులుగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872కు బదులుగా భారతీయ సాక్ష్య అధిని యం 2023 అమల్లోకి రానున్నాయని డీజీపీ రవి గుప్తా తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సీపీ అభిషేక్ మొహంతి కమిషనరేట్ పోలీసు అధికారులతో పలు అంశాలపై చర్చించారు. జూలై 1వ తేదీ నుంచి మారిన చట్టాలకు అనుగుణంగా కేసులు నమోదు చేయాలన్నారు. నేరస్థులు తప్పించుకునేందుకు వీలులేకుండా, బాధితులకు న్యాయం జరిగేలా పకడ్బందీగా చట్టాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, శ్రీనివాస్ జి, విజయకుమార్, కాశయ్య, జిల్లాలోని అన్ని విభాగాల సీఐలు, ఆర్ఐ వెల్ఫేర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌కు హాజరైన పోలీసు అధికారులు

ఆగిపోయిన అభివృద్ధి పనులు

- తొమ్మిది నెలలుగా ముందుకు సాగని వైనం
- దృష్టి సారించని అధికారులు



చొప్పదండిలో నిలిచిపోయిన రోడ్డువెడల్పు పనులు, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

చొప్పదండి, జూన్ 27: చొప్పదండి పట్టణంలో అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దాదాపు తొమ్మిది నెలలు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. గత యేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు పనులను కాంట్రాక్టర్‌లు నిలిపివేశారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ ఎత్తివేసిన తరువా త కూడా పనులపై అధికారులు దృష్టి సారించలేదు.

- 2022లో అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ 33కోట్ల రూపాయలతో చేపట్టే రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, 2కోట్లతో ఇంటి గ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపిన చేశారు. యేడాది తరువాత పనులు ప్రారంభం కాగా అసెంబ్లీ ఎన్నికల ముందు పనలను ఎన్నికల కోడ్‌తో నిలిపివేశారు. పట్టణంలో 4 కిలోమీటర్ల ప్రధాన రహదారిని 100పీట్ల వెడల్పు, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం 33 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. రోడ్డు పనులు చేపట్టగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 2 కోట్ల పనులతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం 70 శాతం పూర్తికాగా మిగతా పనులు నిలిచిపోయాయి. పట్ట ణంలో రోడ్డుకిరువైపులా కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. మార్కెట్ నిర్మాణం పూర్తయితే రోడ్డుపై ఉన్న దుకా ణాల సముదాయం ఇంటి గ్రేటెడ్‌లోకి తరలిపోవడంతో రహదారి విశాలంగా మారుతుంది.

● ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎదురు చూపులు

చొప్పదండి, ఆర్నకొండలో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు నిర్మాణం పూర్తికాకపోవడంతో ఐదేళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు. చొప్పదండిలో 164 ఇళ్ల నిర్మాణం 75 శాతం పూర్తి కాగా, ఆర్నకొండలో 90 ఇళ్ల 90 శాతం పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని లబ్ధిదారులకు ఇళ్ల పూర్తి చేసి అందించాలని కోరుతున్నారు.

● అర్ధంతరంగా నిలిచిపోయిన ఫైర్‌స్టేషన్ భవనం

చొప్పదండిలో 2018లో ఫైర్‌స్టేషన్‌ను మంజూరు చేయగా అప్పటి మంత్రి ఈటల రాజేందర్ ఫైర్‌స్టేషన్ భవనం కోసం శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం కోసం ఎస్‌ఆర్‌ఎస్‌పి స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణం చేపట్టగా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. యేడాదికి పైగా పనులు నిలిచిపోగా తాత్కలికంగా ఫైర్‌స్టేషన్‌ను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తు న్నారు.


ఇంటిగ్రేడెడ్ మార్కెట్

క్రీడా పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఈఓ జనార్దన్‌రావు
- ముగిసిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలు


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ జనార్దన్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్27: జిల్లా విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యం లో రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో 4వ తరగ తి ప్రవేశాలకు నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా శారీరక సామర్థ్య పరీక్షలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరో అతిథి డీపీఓ రవీందర్ హాజరై బాలుర పరు గు పందెం పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. 80 మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఏడు అంశాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటి మొదటిస్థానంలో నిలిచిన 20మంది బాలికలను 20మంది బాలురను రాష్ట్రస్థాయికి ఎంపికచేశారు. హైదరాబా ద్‌లోని హకీంపేటలో జూలై 8నుంచి 12తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల నిర్వహణ జిల్లా యువజన క్రీడల అధికారి బి.శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత దళితబంధు లబ్ధిదారుల ఆందోళన

హుజూరాబాద్, జూన్ 27: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని దళితబంధు రెండో విడత సాధన సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయడంలో ప్రస్తుత ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో తాత్సారం చేయడం వల్లే రెండో విడత నిధులు రాలేదన్నారు. దళితుల ఓట్ల కోసమే అప్పటి అధికారులతో బలవంతంగా

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

దళితబంధు నిధులను నిలిపివేశారన్నారు. కౌశిక్‌రెడ్డి ఒక దళిత ద్రోహి అని, కౌశిక్‌రెడ్డిని నియోజకవర్గంలో తిరగనివ్వమన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా దళితబంధు రెండో విడత నిధులను మంజూరు చేయాలని కోరారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కేసీ క్యాంపులోని ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సురేష్, రాజేష్, నరేష్, రాకేష్, ఆకాష్, నాగరాజు, రక్షిత్, భిక్షపతి, అరుణ, సరిత, రీటా తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న దళితబంధు రెండో విడత సాధన సమితి నాయకులు

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

- జూలై 2 వరకు అవగాహన కార్యక్రమాలు - విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

-నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు

గణేశ్‌నగర్, జూన్ 27: ప్రతి సంవత్సరం జూన్ 26 నుంచి జూలై 2 వరకు నిర్వహిస్తున్న జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించాలని నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు 'ఆంధ్రజ్యోతి'కి గురువారం తెలిపారు.

● వర్షం సమయంలో విద్యుత్ వైర్లను తాకవద్దు..

ఎలక్ట్రికల్ వర్క్స్ లైసెన్స్ కాంట్రాక్టర్ ద్వారా మాత్రమే చేయించాలన్నారు. ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్ గేర్, పరికరాలు ఐఎస్ఐ మార్క్ ఉన్నవి మాత్రమే ఉపయోగించాలన్నారు. అన్ని ఉపకరణాలకు సరియైన ఎర్తింగ్ ఉండాలన్నారు. విద్యుత్ ఉపకరణములను వినియోగించేటప్పుడు రబ్బర్ చెప్పులు లేదా రబ్బర్ షూస్ ఉపయోగించాలని సూచించారు. ఆరుబయట వాడే ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్ బోర్డు మొదలైనవి వాటర్ ప్రూఫ్‌కు సంబంధించినవి మాత్రమే ఉపయోగించాలన్నారు. ఎవరికైనా విద్యుత్ ప్రమాదం జరిగితే వెంటనే విద్యుత్ సరఫరా ఆపి వేసి ప్లాస్టిక్ వస్తువుతో గాని ఎండిన కర్రతో గాని విద్యుత్ ప్రమాదం జరిగిన వ్యక్తిని వేరుచేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ ప్రమాదం జరిగిన వ్యక్తిని సప్లయ్ ఆపివేయకుండా తాకొద్దని తెలిపారు. విద్యుత్ ప్రమాదం జరిగిన వ్యక్తికి వెంటనే ప్రమాద చికిత్స (సీపీఆర్) చేయాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో తెగిన విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి మాత్రమే కూలర్‌లో నీళ్ళు పోయాలన్నారు. మొబైల్ చార్జర్, ఇతర పరికరాలను సాకెట్ నుంచి తీసేటప్పుడు విద్యుత్ సరఫరా ఆపివేయాలని డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు సూచించారు.

విద్యుత్ వైర్లు తెగి వాహనాలపై పడితే వాహనాలను పట్టుకొని కిందకు దిగరాదని ఆయన అన్నారు. సంబంధిత విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి విద్యుత్ నిలిపివేసిన తరువాతే దిగాలన్నారు. దుస్తులను విద్యుత్ వైర్ల పైన, పరికరాలపైన ఆరవేయవద్దని తెలిపారు. విలువైన విద్యుత్ పరికరాలకు ఎస్‌పీడీ, సర్జ్ ప్రొటెక్టివ్ డివైస్‌ను ఉపయోగించాలని ఆయన సూచించారు. సర్వీస్ వైర్లకు ఎర్తింగ్ చేసిన జీఐ వైర్ సపోర్ట్ ఇవ్వాల అన్నారు. ఎత్తైన బిల్డింగ్స్, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్, విద్యాసంస్థలు మొదలైన వాటికి మెరుపు రక్షణ (లైట్నింగ్ ప్రొటెక్షన్)ను అమర్చాలని సూచించారు.

● ఎమర్జెన్సీ లైటింగ్ ఉపయోగించాలి..

చిన్న పిల్లల హాస్పిటల్, విద్యా సంస్థల్లో షట్టర్ టైపు సాకెట్ ఔట్‌లెట్లను ఉపయోగించాలని సూచించారు. హాస్పిటల్‌లో రోగికి ఉపయోగించే మానిటరింగ్ ఎక్విప్‌మెంట్, ఇతర ఉపకరణాలకు ఏదైన ఒక సప్లయ్ యూపీఎస్ లేదా రా, పవర్‌లో ఏదో ఒకటి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. హాస్పిటల్, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లలో ఎమర్జెన్సీ లైటింగ్ ఉపయోగించాలన్నారు. వైరింగ్‌ను ఎఫ్ఆర్, ఎఫ్ఆర్ఎల్ఎస్‌ఎచ్, ఎచ్ఎఫ్ఎఫ్ఆర్ కేబుల్స్‌తో చేయాలన్నారు. దాన్ని ఇతర వైరింగ్‌తో కలపవద్దని ఆయన సూచించారు. గోదాంలలో వైరింగ్‌ను ఉపయోగించరాదన్నారు. తప్పనిసరి అయితే ఐఎస్3594:1991 కోడు ప్రకారం చేయాలన్నారు. ఫైర్ గోదాంలలో ఎట్టి పరిస్థితిల్లోనూ ఎలక్ట్రికల్ వైరింగ్‌ను ఉపయోగించవద్దని వివరించారు. పెట్రోల్ బంక్, ఇతర మండే స్వభావం గల ద్రవ, వాయు ఇంధనాలు/పదార్థాలు ఉన్న చోట ఫ్లేమ్ ప్రూఫ్ ఫిట్టింగ్స్ స్విచ్ బోర్డు, ఎక్విప్‌మెంట్‌లను మాత్రమే ఉపయోగించాలన్నారు. స్విమ్మింగ్ పూల్స్‌లో ఎలాంటి పరికరాలను అమర్చవద్దని డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు సూచించారు.

మల్యాలలో దొంగతనం

మల్యాల, జూన్ 27: మల్యాల మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. కనగర్తి రేణుక అనే మహిళ బుధవారం తన తల్లిగారింటికి వెదిరకు వెళ్లి గురువారం ఉదయం తిరిగి రాగ ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 17 తులాల వెండి, రెండు గ్రాముల బంగారం, రూ.25వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

అలాగే ఇదే మల్యాలకు చెందిన సంగెపు మౌనిక అనే మహిళ ఇంట్లోనూ దొంగతనం జరిగింది. మౌనిక, కుటుంబసభ్యులు మంగళవారం దైవదర్శనానికి తిరుపతికి వెళ్లగా గురువారం ఇంటి తాళాలు తీసి ఉండడంతో పక్కింటి వాళ్లు సమాచా రం అందించారు. దీంతో హుటాహుటిన వచ్చిన మౌనిక కుటుంబస భ్యులు ఇంట్లో చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులోని రూ.20వేల నగదు, 20తులాల వెండి, మూడు గ్రాముల బంగారంను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై-2 కుమారస్వామి తెలిపారు. కాగా ఇరవై రోజుల క్రితం తాటిపల్లిలో రెండిళ్లలో దొంగతనం జరుగగా ఇప్పుడు మల్యాలలోనూ రెండిళ్లలో చోరీ జరిగిం ది. తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు జరుగడం మండల వాసులను ఆందోళనకు గురి చేస్తోంది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 27: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 11మంది రైతులు 230 క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు 13 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7550 రూపాయలు, కనిష్ఠ ధర 5,000 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొండగట్టులో నేడు జ్యేష్టాభిషేకం

మల్యాల, జూన్ 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శుక్రవారం జ్యేష్టాభిషేకం కార్యక్రమంల నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి 108 కళాశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జ్యేష్టాభిషేకం చేయడం జరుగుతుందని తెలిపారు.

భక్తురాలికి నగదు, సెల్ ఫోన్‌ను అప్పగింత



భక్తురాలి బంధువులకు అప్పగిస్తున్న ఈవో

ధర్మపురి, జూన్ 27: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఒక భక్తురాలు క్యాష్ బ్యాగు, పర్సు, సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సిబ్బంది వెతికి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ద్వారా గురువారం ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎల్లారెడ్డి మండలంలోని మారెడ గ్రామానికి చెందిన ఎన్నం జనార్దన్ రెడ్డి భార్య సుజాత స్థానిక లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం వచ్చారు. ఉదయం దైవ దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో తనకు సంబంధించిన రూ 10,000 విలువ గల సెల్ ఫోన్, క్యాష్ పర్సు, బ్యాగులో మెడిసిన్ పోగొట్టుకుంది. ఆ సెల్ ఫోన్, క్యాష్ పర్సు పెండ్యాల గణేష్ అనే సిబ్బందికి దొరకడంపై విచారణ జరిపి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ భక్తురాలి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భక్తురాలుతో పాటు కుటుంబ సభ్యులు కలిసి ఆలయ సిబ్బందితో పాటు ఈవోకు కృతజ్ఞతలు తెలిపారు.

ఊటూర్ సొసైటీ కార్యాలయం ఎదుట మృతదేహంతో ధర్నా

మానకొండూర్, జూన్ 27 : మండలంలోని ఊటూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట గ్రామస్థులు మృతదేహంతో గురువారం ధర్నా చేశారు. ఊటూర్ సహకార సంఘం ప్రధాన కార్యాలయం లక్ష్మీపూర్‌లో 20 ఏళ్ళుగా అదే గ్రామానికి చెందిన చుక్క రాజయ్య(53) అనే వ్యక్తి హమాలీగా పని చేస్తున్నాడు. కాగా సొసైటీకి ఎరువుల వ్యాన్ రావడంతో రాజయ్యతో పాటు తోటి హమాలీలు ఎరువులు దించుతుండగా ప్రమాదవశాత్తు రాజయ్య కిందపడిపోగా తలకు తీవ్రగాయం అయింది. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అంబులెన్స్‌లో మృతదేహన్ని గ్రామానికి తరలించి సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పాలకవర్గం మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కొద్దిసేపు ఆందోళన చేశారు. దీంతో మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తామని పాలకవర్గం హామీ ఇవ్వడంతో మృతదేహన్ని తరలించారు. మృతుడికి భార్య మంగమ్మ, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు.



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

అదనపు కట్నం వేధింపులు..

కూతురుతో బావిలో దూకి తల్లి ఆత్మహత్య



మౌనిక, సాహితి(ఫైల్)

సారంగాపూర్, జూన్ 27: అదనపు వరకట్న వేధింపులు తల్లీకూతుళ్లను బలిగొన్నాయి. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని కూతురు పుట్టినప్పటి నుంచి అత్తింటి వారి నుంచి వేధింపులు పెరగడంతో ముక్కుపచ్చలారని చిన్నారితో సహా ఓ తల్లి బావిలో దూకి తనువు చాలించింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకున్న ఘటన తీవ్ర విషాదం నింపింది. స్థానికులు, ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. అర్పపల్లి గ్రామానికి చెందిన బోండ్ల సురేష్‌కు మంగెళ గ్రామానికి చెందిన మౌనిక(28)తో 2020 సంవత్సరంలో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నం కింద రూ. 5లక్షలతో పాటు ఏడున్నర తులాల బంగారం ముట్టజెప్పారు. దంపతులు ఏడాది పాటు సంతోషంగానే గడిపారు. 2021లో వీరికి కూతురు సాహితి(3) జన్మించింది. కూతురు పుట్టినప్పటి నుంచి రూ. 2 లక్షలు అదనపు కట్నం తేవాలంటూ భర్త సురేష్, అత్త జల, సురేష్ అమ్మమ్మ గంగవ్వ నిత్యం వేధింపు లకు గురిచేయడం మొదలు పెట్టారు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. వారంరోజుల క్రితం మళ్లీ కట్నం కోసం ఇంట్లో గొడవ జరగటంతో మౌనిక తల్లిగారింటికి బీర్‌పూర్ మండలంలోని మంగేళకు వెళ్లింది. రెండు రోజుల క్రితం భర్త సురేష్ సోదరి చనిపోవడంతో మౌనిక అత్తగారింటికి వచ్చింది. అదే రోజు దంపతుల మధ్య మళ్లీ కట్నం కోసం గొడవ జరిగింది. ఈ విషయం మౌనిక తన అక్క జమునకు ఫోన్ ద్వారా తెలిపింది. తెల్లవారుజామున భర్త లేచి చూసే సరికి ఇంట్లో కూతురు, మౌనిక కనిపించకపోవడంతో బావమరిదికి ఫోన్‌చేసి చెప్పాడు. చుట్టు పక్కల గాలించగా పక్కనే ఉన్న బావిలో చిన్నారితో పాటు మౌనిక శవమై కనిపించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాలను పైకి తీశారు. మౌనిక అన్న గంగాధర్ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, గంగవ్వలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాత్తాద్రి తెలిపారు.

హుజూరాబాద్‌లో కిడ్నాప్ కలకలం

● తన భార్యతో సహజీవనం చేస్తున్నాడని కిడ్నాప్ ● పోలీసుల అదుపులో నిందితులు

హుజూరాబాద్, జూన్ 27: తన భార్యతో సహజీవనం చేస్తున్నాడని సదరు వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన గురువారం హుజూరాబాద్‌లో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన సతీష్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కుటుంబం సాఫీగా సాగుతోంది. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన ధనుష్ అనే యువకుడితో సదరు వివాహిత ప్రేమలో పడి, సంవత్సరం క్రితం ఇద్దరు ఇంటి నుంచి వెళ్లిపోయారు. సతీష్ తన భార్య కోసం సంవత్సరం నుంచి తన బంధువులు, స్నేహితుల సహకారంతో వెతుకుతున్నాడు. అయితే సతీష్ భార్య ధనుష్ అనే యువకుడితో ఆరు నెలల నుంచి హుజూరాబాద్‌లో ఉంటుందని తెలుసుకున్నాడు. గురువారం సతీష్ కారులో తన ఇద్దరు స్నేహితులను తీసుకొని హుజూరాబాద్‌కు వచ్చాడు. ధనుష్ నివాసం ఉండే ఏరియాకు సతీష్ రాగ, చేపల మార్కెట్ వద్ద ధనుష్ కనబడ్డాడు. దీంతో సతీష్ తన కారుతో ధనుష్‌ను ఢీ కొట్టి, బలవంతంగా కారులో ఎక్కించుకొని, పట్టణ శివారులోని కేసీ కెనాల్ వద్దకు తీసుకెళ్లి దాడి చేసినట్లు సమాచారం.

గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసీ క్యాంపు వద్ద నిందితులను పట్టుకున్నారు. సతీష్, ఇద్దరు స్నేహితులను, భార్యను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కారును సీజ్ చేశారు. ఈ సంఘట నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 27: మండలంలోని రాజపల్లి గ్రామపంచాయతీ సమీపంలోని గొల్లపల్లి వద్ద గురువారం ఓ ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డం రావడంతో బైక్‌పై నుంచి ఓ వ్యక్తి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమీపంలోని ఆజామ్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ వొడితల శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం గొల్లపల్లి వద్దకు చేరుకోగానే ఓ కుక్క అడ్డం రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో కాళ్ల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా శ్రీనివాస్ కొన్ని నెలలుగా హుజూరాబాద్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు అతడి స్నేహితులు తెలిపారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్‌లను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్‌లను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొంది 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్ల కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ ధైర్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ.. ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం

» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలుపడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల

» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు

» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరగడానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృ భాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న రాము

కరీంనగర్ టౌన్, జూన్ 27: ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వర్టయిజ్‌మెంట్ అసోసియేషన్ కరీంనగర్‌శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం స్థానిక మినీ పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా దండ జనార్దన్‌రెడ్డి, అధ్యక్షుడిగా యెలిగేటి కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా గంగుల మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా కొమిరె మల్లయ్యగౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రేణు మల్లయ్య, ఆకుల నాగయ్య, పీచర లక్ష్మన్‌రాజు, సంయుక్త కార్యదర్శులుగా సిరిపురం నాగభూషణం, ముస్కు విద్యాసాగర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కటుకం కేశవ్, బరిగేల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.లక్ష్మన్‌రావు, జె.సత్యరాజ్, ఎం.కుమార్, యు.రాజేశం, ఎస్.శ్రీధర్, ఎండి అజీజ్, బి.కనుకయ్యగౌడ్, వీలో ప్రవీణ్‌కుమార్, ఏ.మునీశ్వర్, ఎం.చక్రపాణిలను ఎన్నుకున్నారు. ఎన్నికైన గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడితో పాటు కార్యవర్గాన్ని రాము యాడ్ ఏజెన్సీ నిర్వాహకుడు రాము సన్మానించారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం



అల్ఫోర్స్‌లో హౌజ్ ఎలక్షన్స్ సరళిని పరిశీలిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూన్ 27: ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు కీలకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో హౌజ్ ఎలక్షన్స్ విద్యార్థుల్లో ఉత్సాహం నింపాయి. ఈ సందర్భంగా అల్ఫోర్స్ ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం ఎన్నికల నిర్వహిస్తామన్నారు. పాఠశాలలోని వివిధ విభాగాలకు కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేయాలి



హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

గణేశ్‌నగర్, జూన్ 27: హెచ్‌సీయూ విద్యార్థుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ వీసీ దిష్టి బొమ్మను గురువారం తెలంగాణచౌక్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను, విద్యార్థులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తిప్పారాపు రోహిత్, ఆసంపెల్లి వినయ్ సాగర్, జిల్లా సహా కార్యదర్శి ఇషాక్ జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, సుష్మిత, నాయకులు తరుణ్, శివమణి, నితీష్, సాయి, మనోహర్, గిరి చరణ్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సలహాలు తీసుకునేందుకు మహాసభ

సైదాపూర్, జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు భరోసా కార్యక్రమానికి రైతుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు జులై 3న ఉదయం 9గంటలకు సంఘం ఆవరణలో రైతు మహాసభ నిర్వహించనున్నట్లు జిల్లా సహకార సంఘాల అధ్యక్షుల ఫోరం అధ్యక్షుడు, వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహా సభకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని రైతు భరోసా కార్యక్రమానికి సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా డిప్యూటి రిజిష్టర్ ఆడిటర్ హాజరై రైతుల సలహాలు, సూచనలు స్వీకరించి జిల్లా అధికారుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారని తెలిపారు.

పిల్లల ఎదుగుదలపై శ్రద్ధ వహించాలి

శంకరపట్నం, జూన్ 27: తల్లిదండ్రులు పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీవో సబిత అన్నారు. గురువారం మండలంలోని చింతగుట్ట, ఇప్పలపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువులను కొలిచారు. పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు, బరువు పెరగడానికి పౌష్టికాహారం అందించాలన్నారు. పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలోకి చేరుతున్న వరద నీరు

● మట్టిలో కూరుకుపోయిన విద్యుత్ మోటర్లు



కల్వర్టును చూపుతున్న బాధిత రైతులు

శంకరపట్నం, జూన్ 27: నేషనల్ హైవే 563 ఫోర్ లైన్ పనుల్లో నిర్మించిన కల్వర్టు నుంచి వచ్చే వరద నీరు నేరుగా వ్యవసాయ బావిలోకి చేరి బావి కూలిన సంఘటన మండలంలోని కొత్తగట్టులో జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన నీలం రాజయ్య, నీలం నాగయ్య, నీలం కనకయ్య, నీలం సమ్మయ్య, నీలం సారయ్య అన్నదమ్ములకు సర్వే నంబరు 231లో ఎనిమిదెకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. బావికి రెండు మోటర్లు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పెద్దగట్టు నుంచి వచ్చిన వరదనీరు జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన కల్వర్టు నుంచి బావిలో చేరి బావి కూలింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మళ్లీ వర్షం నీరు చేరడంతో బావి ప్రమాదకరంగా మారింది. మట్టి కింద కూరుకుపోయిన విద్యుత్ మోటర్లు తీసేందుకు ప్రయత్నించిన రాలేదు. తమకు బావితో పాటు వ్యవసాయ మోటర్లకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. కల్వర్టు నుంచి వచ్చే వరద నీరు వ్యవసాయ బావిలోకి రాకుండా సాయినికుంటకు వెళ్లే విధంగా కల్వర్టు ఏర్పాటు చేయాలని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

ఉద్యోగ విరమణ

గంగాధర, జూన్ 27: గంగాధర ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న సబార్డినేట్ నర్సమ్మ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో పాల్గొన్న ఎంఈవో వేణుకుమార్ నర్సమ్మను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలి'



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీ రంగ రాజన్

భగత్‌నగర్, జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వాలు నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్ అన్నారు. బుధవారం ట్రినిటి కళాశాలలో ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల విద్యపై కేంద్ర ప్రభుత్వం చులకన వహిస్తున్నదన్నారు. జాతీయ విద్యా విధానం రద్దుకై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. శాస్త్రీయ విధానం అమలుతోనే సమా జంలో మనుగడ సాగిస్తామన్నారు. ఢిల్లీ కేంద్రంగా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారన్నారు. నూతన జాతీయ విద్యావిధానంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల సీట్లు, నీట్ పరీక్ష సైతం మోదీ గుప్పిట్లో ఉందన్నారు. నీట్‌తీసుకు వచ్చినప్పటి నుండి ప్రైవేట్ మెడికల్ సీట్లలో డొనేషన్లు పెరిగాయే తప్ప తగ్గడం లేదన్నారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించారన్నారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ అలయన్స్ ప్రభుత్వాలతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో జాతీయ విద్యా విధానం నీట్ పరీక్షను వ్యతిరేకిస్తు తీర్మానించి కేంద్రానికి నివేదించాలని సూచించారు.

యువతతోనే రాజకీయ ప్రక్షాళన సాధ్యం

దేశంలో భ్రష్టు పట్టిన రాజకీయ వ్యవస్థలో మార్పుకు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు నిరంతరం శ్రమించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. యువతతోనే రాజకీయాల ప్రక్షాళన సాధ్యమవుతుందని నద్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం నాలుగున్నర కోట్ల బాల కార్మికులుగా పనిచేస్తుండడం బాధాకరమన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలే ప్రభుత్వంలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయన్నారు.

ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం, గ్యార క్రాంతి, రెహమాన్, నాగజ్యోతి రాజు, బాలసాని లెనిన్, సోతుకు ప్రవీణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుమచ్చ రమేష్, లక్ష్మణ్, జనార్ధన్, వెంకటేష్, ప్రీతం, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 27: నగరంలోని జ్యోతినగర్, వేంకటాద్రి కాలనీ మహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజపట వాస్తు శుద్ధి, గరుడపట ఆవాహనం, రక్షాబంధనం, నవసంధి ఉత్సవం, కర్కాటక లగ్నంలో ధ్వజారోహణం, గరుడ ప్రసాద వినియోగం, స్నపన తిరుమంజనం, సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, కుంభారాధన శాస్త్రోక్తంగా చేశారు. రాత్రి ఆలయ మాడ వీధుల్లో శేషవాహనసేవ కన్నుల పండువలా జరిగింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష ఉపాధ్యక్షులు వేంకటేశ్వర్లు, గోపాలరావుతో పాటు మురళి, అనంతరెడ్డి, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, పరంధాములు, ప్రధానార్చకుడు దీవి కృష్ణకిషోర్, భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూన్ 27: జాతీయ చేనేత దినోత్సవం ఆగస్టు 7న ప్రకటించనున్న కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డుల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ, డిజైన్‌లో నైపుణ్యత కనబరిచిన, చేనేత రంగంలో విశిష్ట సేవ చేసిన చేనేత కళాకారులకు కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందని అన్నారు. 31.3.2023 నాటికి 30 సంవత్సరాల వయసు నిండి చేనేత రంగంలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగియున్న చేనేత కళాకారులు ఈ అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. చేనేత డిజైనర్స్‌లో 31.12.2023 నాటికి 25 సంవత్సరాలు నిండి చేనేత రంగంలో కనీసం ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని చెప్పారు. అర్హత కలిగిన ఔత్సాహికులు నిర్ణీత దరఖాస్తు ఫారమును నింపి వారి నైపుణ్యత, నమూనాలను శాంపిల్స్‌తో సహాయ సంచాలకులు చేనేత, జౌళిశాఖ కార్యాలయం, పొన్నం కాంప్లెక్సు మంకమ్మతోట, కరీంనగర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి కూలీల వేతనాలు విడుదల చేయాలి

భగత్‌నగర్, జూన్ 27: ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రుపాధ్యక్షుడు బిప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఉపాధి హామీ చట్టంపై నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కూలీల వేతనాలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని పేదలకు 12 వేల రూపాయలు, కౌలు రైతులకు 15 వేల రూపాయల, ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టుకోవడానికిఐదు లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు పంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న పేదలకు ఆస్థలాల్లోనే ఇండ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. సదస్సులో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు, జిల్లా సహాయ కార్యదర్శి రాయకంటి శ్రీను, అంబల సుశీల, ఎ స్వప్న, మంగ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని కాపాడాలని మేయర్‌కు వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ భర్త సతీష్‌కుమార్

కరీంనగర్ టౌన్, జూన్ 27: నగరంలోని 39వ డివిజన్ పరిధిలో గల శ్రీవేంకటేశ్వరకాలనీ, హరిహరనగర్ కాలనీల్లోని సర్వేనెంబర్ 1230, 79/2, 80 లలో దాదాపు మూడు దశాబ్దాల క్రితం లేఅవుట్ చేసి ప్లాట్లుగా విక్రయించిన సమయంలో ప్రజావసరాల కోసం వదిలిపెట్టిన పబ్లిక్ ప్రాపర్టీని కాపాడాలని డివిజన్ కార్పొరేటర్ కొండపల్లి సరిత, ఆమె భర్త కొండపల్లి సతీష్‌కుమార్ కోరారు. గురువారం కార్పొరేటర్ సరిత, సతీష్ కుమార్ మేయర్ సునీల్‌రావును క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. లేఅవుట్ చేసి ప్లాట్లుగా విక్రయించిన సమయంలో ప్లాట్ నెంబర్లు 312,313లోని దాదాపు 400 గజాల స్థలాన్ని కాలనీవాసుల అవసరాల కోసం వదిలిపెట్టారు. ఈ స్థలాన్ని పక్కనే ప్లాట్ నెంబర్ 311లో ఇళ్ళు కట్టుకొని నివాసముంటున్న గుర్రం రాజయ్య, ఆయన కుమారుడు బాల నరేందర్‌లు కలిసి గిఫ్ట్ సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ నెంబర్ 3686/22ను చేసుకొని వాళ్ళ ఇంటి నెంబర్ 3-76/24/3 నెంబర్‌కు బై నెంబర్ 3-76/24/3/ఎ/1 వేసి చీటి ఉపేందర్‌రావు, ఉప్పు శ్రీనివాస్‌లకు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ఆక్రమిత స్థలంలో చిన్న షెడ్ నిర్మాణం చేసి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని మేయర్ సునీల్‌రావుకు వివరించారు. స్థానికులంతా కలిసి నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులకు 2024లో ఫిర్యాదు చేశారని, అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యతీసుకోలేదని తెలిపారు. అక్రమంగా నిర్మించిన షెడ్‌ను కూల్చివేసి, ఇంటినెంబర్‌ను కూడా రద్దు చేసి ప్రజలకు ఉపయోగపడే ఈ స్థలాన్ని కాపాడాలని డివిజన్ ప్రజల పక్షాన కోరారు.

పార్లమెంట్ ముట్టడికి తరలిన యూత్ కాంగ్రెస్ నేతలు



పార్లమెంట్ ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, జూన్ 27: నీట్ పరీక్షను రద్దు చేయాలని గురువారం నిర్వహించిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాహుల్, ప్రధాన కార్యదర్శి కిమ్ ఫహద్‌ల ఆధ్వర్యంలో నాయకులు పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బివి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ యువజన కాంగ్రెస్ కార్యాలయం నుంచి పాదయాత్రగా పార్లమెంట్‌కు వెళ్ళి ముట్టడించే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, పోలీసుల మధ్య తోపులాటజరిగింది. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షులు పడాల రాహుల్‌లు మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి మళ్ళీ నిర్వహించి 24 లక్షల మందికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజిపై జసిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శ్యాంసుందర్‌రెడ్డి, పొన్నం మధు, యువజనకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కిమ్ ఫహద్, అరవింద్, ఎండీ అజీమ్, ప్రశాంత్‌గౌడ్, సజ్జు, అన్వార్ అలీ, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

●జమ్మికుంట రూరల్: పార్లమెంట్ ముట్టడికి జమ్మికుంటకు చెందిన పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహ్మద్ సజ్జద్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీలు

- సీఎంఆర్ బకాయిలపై శ్రీరాములపల్లె రైస్‌మిల్‌లో పరిశీలన - ధాన్యం, బియ్యం మధ్య భారీ వ్యత్యాసం



మిల్లులో ఆరు బయట ఉన్న ధాన్యం

ఇల్లందకుంట, జూన్ 27: ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో శ్రీసీతారామ ఆగ్రో ఇండస్ట్రీట్ (మిల్)లో జిల్లా సివిల్ సప్లయీస్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు రైస్‌మిల్‌లో ఉన్న వరిధాన్యాన్ని పరిశీలిం చారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ మిల్ బయటనే ధాన్యం తడుస్తుండటంతో మిల్ యజమాని పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ముక్కిపోయిన ధాన్యాన్ని చూసి అధికారులు నివ్వెరపోయారు. ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ బియ్యం రాకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన వడ్లు పూర్తిగా మిల్‌లో లేకపోవడం పట్ల అసహనానికి గురయ్యారు. అధికారులు వస్తున్నారని ముందే తెలుసుకొని మిల్‌యజమాని అందుబాటులో లేనట్లు తెలిసింది. మిల్‌కి సంబంధించిన గుమస్తా కూడా అందుబాటులోకి రాలేదు. మిల్‌లో ఉన్నటువంటి ధాన్యం, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యంలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర సివిల్ సప్లయీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రభుత్వానికి బకాయి ఉన్నటువంటి మిల్‌లో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో జగిత్యాల జిల్లా డీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషలాఫీసర్ లక్ష్మారెడ్డి, సివిల్ సప్లయీస్ అధికారులు వినోద్, ఏఎస్ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సత్యంను పరామర్శించిన రసమయి



ఎమ్మెల్యే సత్యంతో మాట్లాడుతున్న రసమయి

తిమ్మాపూర్, జూన్ 27: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం పరామర్శించారు. సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల ఆత్మహత్య చేసుకోగా రసమయి బాలకిషన్ హైదారాబాద్‌లోని మేడిపల్లి సత్యం నివాసానికి వెళ్లి పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

దళిత కాలనీలో వెలిగిన వీధి దీపాలు

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గంగాధర, జూన్ 27: విద్యుత్ అధికారులు గురువారం లక్ష్మీదేవిపల్లి దళిత కాలనీలో కరెంటు సమస్యను గుర్తించి మరమ్మతులు జరిపి విద్యుత్‌ను పునరుద్ధరించారు. 'ఇరవై రోజులుగా దళిత కాలనీలో వెలగని విద్యుత్ దీపాలు' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ అధికారులు పోల్ టూ పోల్ తిరిగి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడింది. కానీ చాలా చోట్ల లైట్లు వెలగడం లేదు. గ్రామ సిబ్బంది త్వరగా వెలగని లైట్లను తీసేసి కొత్తవి అమర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పాఠశాల విద్యార్థులకు నోటు బుక్స్ వితరణ



నోట్ బుక్స్ అందజేస్తున్న జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్, జూన్ 27: స్థానిక జ్యోతిష్మతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రామకృష్ణకాలనీ, సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు బుక్స్ వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, తిమ్మాపూర్ తహసీల్దార్ కనకయ్య పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 250మంది విద్యార్థులకు ఒక్కోరికి 12నోట్ బుక్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలు ప్రారంభం కాగానే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ ప్రతీ సంవత్సరం అందిస్తున్నామన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం, గ్రామపెద్దలు జువ్వాడి సాగర్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కురం లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం మహేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

'నిత్యం మీడియాలో కనపడేందుకు కౌశిక్‌రెడ్డి ఆరాటం'



సమావేశంలో మాట్లాడుతున్న దేశిని కోటి

జమ్మికుంట, జూన్ 27: పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో నిత్యం కనపడేందుకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరాట పడుతున్నారని ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళ గవర్నర్ అని కూడా చూడకుండా బూతు పదాలు ఉపయోగించి మాట్లాడిన వ్యక్తి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ ఏం అభివృద్ధి చేశాడో చర్చకు రావాలని సవాల్ విసిరాడు. కాని ఈటల రాజేందర్ అతన్ని లైట్‌గా తీసుకున్నాడన్నారు. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ బూడిద కుంభకోణం చేశారు అంటూ ఆరోపణలు చేస్తూ చర్చకు రావాలని సవాల్ విసిరాడని, మంత్రి మాత్రం కౌశిక్‌రెడ్డిని ఒక తెలంగాణ ద్రోహిగా మాత్రమే చూస్తున్నాడన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు పొనగంటి మల్లయ్య, సాయిని రవి, కౌన్సిలర్లు బొంగోని వీరన్న, రావికంటి రాజు, దేశిని రాధ-సదానందం, పొనగంటి రాము, మారపల్లి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఓవైసీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

భగత్‌నగర్, జూన్ 27: హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు ఓవైసి సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ అన్నారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసే సమయంలో పార్లమెంట్ సాక్షిగా దేశ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించి జై పాలస్తీనా అనే నినాదాన్ని చేయడం గర్హనీయమన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం/ఇల్లందకుంట, జూన్27: పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 1995 బ్యాచ్‌కు చెందిన మేకల శ్రీనివాస్ మేకల శ్రీనివాస్(51) గురువారం గుండెపోటుతో మరణించాడు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధుల్లో ఉండగానే శ్రీనివాస్ గుండెపోటుకు గురికాగా వెంటనే తోటి సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. శ్రీనివాస్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామం ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి తరలించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. మృతుడికి భార్య ఇద్దరు కొడుకులు, కూతుర్లు ఉన్నారు. శ్రీనివాస్ అంత్యక్రియల్లో కరీంనగర్ అడిషనల్ డీసీపీ(ఏఆర్) అనోక్‌జైన్ పాల్గొన్నారు. అంత్యక్రియల ఖర్చు కింద 20 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ మోడెం సురేష్, ఆర్ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

రహదారి పనులపై ఇరువర్గాల వాగ్వాదం

కరీంనగర్ రూరల్, జూన్27: తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవనం నుంచి వల్లంపహాడ్ వరకు పంచాయతీరాజ్ నిధులు 2కోట్ల వ్యయంతో బీటి రోడ్డు నిర్మాణపు పనులు చేపట్టారు. ఆర్నెళ్ళ క్రితం తీగలగుట్టపల్లి పరిధిలో రోడ్డు నిర్మాణం పూర్తి కాగా వల్లంపహాడ్ పరిధిలో తమ పట్టా భూముల నుంచి రోడ్డు నిర్మిస్తున్నారంటూ కొంత మంది రైతులు కోర్టులో కేసు వేసి స్టే ఆర్డర్ తీసుకువచ్చారు. ఇటీవల స్థానికులు కలెక్టర్‌కు ప్రజా వాణిలో కలిసి రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆర్ఐ రజనీకాంత్, సర్వేయర్ సంతోష్ రోడ్డు నిర్మాణం నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామ నక్షాలో ఉన్న ప్రకారం రోడ్డు నిర్మించాలని కొందరు వ్యక్తులు డిమాండ్ చేయగా తమ పట్టా భూముల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టవద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. చివరకు నక్షా ప్రకారం రోడ్డు నిర్మాణం చేసేందుకు సర్వే చేస్తామని ఆర్ఐ ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది, రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి రోడ్డుకు అవసరైన స్థలాన్ని గుర్తించి హద్దులను ఏర్పాటు చేస్తామని ఆర్ఐ రజనీకాంత్ తెలిపారు.

వీడియో జర్నలిస్టుకు ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, జూన్ 27: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వీడియో జర్నలిస్టు నరేష్‌కు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం, డ్రైవర్ల సంఘం ఉద్యోగులు ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం నరేష్‌ను కలిసి టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు చేతుల మీదుగా రూ.14,500లు అందచేశారు. కార్యక్రమంలో నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి దూల్గుంటి నరసింహారెడ్డి, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, టీఎన్‌జీవో అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, అరసవెల్లి రాజేశ్వర్‌రావు, శంకర్, ఫోటోగ్రాఫర్ షకూర్, కిరణ్, సుధాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

సుభాష్‌నగర్, జూన్ 27: మహనీయుల ఆశయాలను కొనసాగించాలని, వారి ఆలోచన విధానంలో నడుచుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని పార్టీ కార్యలయంలో బొజ్జ తారకం 85వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగ అపర్ణ, ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, మొగిలి సతీష్, అంజయ్య, సుద్దాల సురేష్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

జమ్మికుంట రూరల్, జూన్ 27: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఎరవెల్లి ఫామ్‌హౌజ్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించే సమయంలో కేసీఆర్ ఆయన చేతిలోని శాలువాను తీసుకొని రాజేశ్వర్‌రావు మెడలో వేశారు.

కేంద్రమంత్రి 'బండి'ని కలిసిన అసెంబ్లీ కన్వీనర్

గన్నేరువరం, జూన్ 27: కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేపీ మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన పుట్టినరోజు సందర్భంగా బండి సంజయ్ ఆశీస్సులు తీసుకున్నాడు.

ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేయాలి

హుజూరాబాద్, జూన్ 27: హుజూరాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా బుక్స్ అమ్ముతున్న ఓ ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, అజయ్, అరుణ్, వరుణ్, శేషు, శ్రీచరణ్, శశాంక్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై లోకాయుక్తలో ఫిర్యాదు

హుజూరాబాద్, జూన్ 27: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీరాజ్ అధికారులపై గురువారం లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు హుజూరాబాద్‌కు చెందిన టి శ్రావణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ మండల పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న పలు అక్రమ నిర్మాణాలపై జిల్లా, మండల పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశామన్నారు. పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఫిర్యాదు చేసి నాలుగు నెలలైనా నోటీసుల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా పంచాయతీ అధికారులపై లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.